క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామ శివారులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ పురోహితుడు మదిపర్తి వెంకట నర్సింహచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రోత్సరణల నడుమ కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో వివిధ మండలాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపు ఖాయం

అశ్వాపురం: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో ప్రజలు కాంగ్రెస్‌కే మద్దతు పలికారని మహబూబాబాద్ ఎంపీగా బలరాంనాయక్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీలలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు గ్యారంటీలు అమలు చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తమ ఓట్లతో మద్దతు తెలిపారని మహబూబాబాద్, ఖమ్మంతో పాటు రాష్ట్రంలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. బలరాంనాయక్ గెలుపు కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్ర పక్షాల వారికి ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు పాలు, పండ్ల వితరణ

అశ్వాపురం: ఉస్మానియా యూనివర్శిటీ ఉద్యమ నాయకుడు, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ఆరీఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు మంగళవారం వృద్ధులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పిడమర్తి రవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, భానుప్రసాద్, విజయ్, నరేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్‌బీసీ ఆఫీస్ రోడ్డులోని ఆల్ పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 15న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ సమీక్ష సమావేశం

దుమ్ముగూడెం: మండలంలోని గంగోలు గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మహబూబాబాద్ పార్లమెంట్ ఎలక్షన్ రివ్యూ సమావేశం నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రివ్యూ మీటింగ్‌కు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య హాజరు అవుతారని ప్రతి బూత్ నుంచి బూత్‌కి సంబంధించిన వివరాలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

భగీరథ మహర్షి జయంతి

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బంగారు దుకాణాల వీధిలో నగర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. నగరులందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి నగరులకు రావాల్సిన, చెందాల్సిన హక్కుల సాధనకు భగీరథ మహర్షిలా ఐక్యంగా పోరాడి సాధించాలన్నారు. సంఘం బలోపేతానికి నగరులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కురిమిళ్ల శంకరయ్య, కుర్మ స్వామి, రాజమౌళి, శంకరయ్య, కళావతి, కౌసల్య, నాయకులు మధు, అశోక్, శ్రీనివాస్, కుర్మ శ్రీనివాస్, సుప్రిత తదితరులు ఉన్నారు.

కాల్ మనీ దందాలు

- రెట్టింపవుతున్న అసలు
- కుదేలవుతున్న సామాన్యుడు
- నిర్వహణపై కానరాని అధికారుల చర్యలు



దమ్మపేట: కాల్ మనీ, వారాంతపు వడ్డీల దందాలతో మండల పరిధిలోని సామాన్య ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. సామాన్యులు, పేదలు, అత్యవసరంగా డబ్బు అవసరాలు కల వారి బలహీనతలను ఆధారంగా చేసుకొని, కాల్ మనీ, వారాంతపు వడ్డీల దందా దమ్మపేట మండలంలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.

చాపకింద నీరులా బిజినెస్..

అనుమతులు లేని అధిక వడ్డీల దందాకు దమ్మపేట అడ్డాగా మారిందని స్థానికులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ప్రధానంగా ఈ కాల్ మనీ, వారాంతపు వడ్డీ, తాకట్టు వడ్డీ వ్యాపార దందాలను గతంలో పొరుగు రాష్ట్రం నుండి వచ్చిన వ్యక్తులు నిర్వహించేవారు. వీరు ఈ దందాలతో పాటుగా గృహోపకరణాలను విక్రయించి, అడ్వాన్సుగా కొంత నగదును తీసుకొని మిగిలిన మొత్తాన్ని వారాంతపు వడ్డీల రూపంలో వసూలు చేస్తున్నారు. క్రమక్రమంగా ఈ అక్రమ వడ్డీ వ్యాపారాలను కొంత మంది స్థానికులు కూడా ప్రారంభించడం జరిగింది. ఈ వ్యాపారాలు చాపకింద నీరులా విస్తరిస్తున్న, వీరిపై చర్యలు తీసుకోకపోడం చర్చనీయాంశంగా మారింది. దీనికి గల ప్రధాన కారణం అప్పు తీసుకున్న బాధితులెవరూ ముందు కొచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయకపోవడమే అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సందర్భానికో వడ్డీ..

కాల్‌మనీలో భాగంగా అత్యవసరంగా డబ్బు కావలసిన వ్యక్తులకు రుణం ఇచ్చేందుకు రూ.5 నుంచి రూ.20ల అధిక వడ్డీని సదరు వ్యాపారులు వసూలు చేస్తున్నారు. ఈ దందాలో రూ.1000ల నుంచి మొదలు రూ.20,000ల వరకు అప్పుగా ఇస్తుంటారు. దీనిలో రూ.10,000లను అప్పుగా తీసుకున్న వ్యక్తికి వ్యాపారి రూ.9400లు మాత్రమే ఇస్తాడు. అప్పు తీసుకున్న వ్యక్తి, అసలును వడ్డీతో సహా కలిపి వారానికి రూ.600ల చొప్పున క్రమం తప్పకుండా, 21 వారాల పాటు చెల్లించాలి. అప్పు తీసుకున్న వ్యక్తి, అవసరం, సందర్భాన్ని బట్టి వీరు వసూలు చేసే వడ్డీ రేట్లు మారుతుంటాయి. వీరు ఇచ్చే అప్పుకు ముందస్తుగానే ఖాళీ ప్రామిసరీ నోట్లు, బ్యాంకు చెక్కులు, తెల్ల పేపరు మీద సంతకాలు తీసుకున్న తర్వాతనే డబ్బును ఇస్తారు. అప్పుగా ఇచ్చే రొక్కం లక్షల రూపాయల్లో ఉంటే, ప్రామిసరీ నోట్లతో పాటుగా, ఋణ గ్రహీతల ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంటారు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో గ్రహీత ఆస్తులను, తనఖా రిజిస్ట్రేషన్ చేయించుకునే సందర్భాలు కూడా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

విక్రయాలతోనూ వసూళ్లు..

వారాంతపు వడ్డీ దందాల వ్యాపారాలు డబ్బులతో పాటుగా కొత్తరకంగా కుర్చీలు, బీరువాలు, టీ.వీలు, మిక్సీలు, గ్రైండర్లు తదితర గృహోపకరణ, ఎలక్ట్రానిక్ వస్తువులను, సామాన్యుల ఇంటివద్దకే వెళ్లి విక్రయిస్తుంటారు. ఎటువంటి బిల్లులు లేకుండా జరుపుతున్న ఈ అమ్మకాల్లో వస్తువుల నాణ్యత ఎంతమాత్రం ఉంటుంది అనేది కూడా తెలియని పరిస్థితి. ఈ గృహోపకరణాలను సామాన్యులకు అమ్మిన మొదటగా, కొంత మొత్తం నగదును వారి నుంచి స్వీకరించి, మిగిలిన రొక్కంను వారాంతపు వాయిదాలలో అధిక వడ్డీతో కలిపి వసూలు చేస్తారు. ఈ ఉపకరణాలకు కనీసం బిల్లులు కూడా ఇచ్చే పరిస్థితి లేదు.

వస్తువుల నాణ్యత, ధరపై అవగాహన లేని సామాన్యులు వీరి చేతిలో తీవ్రంగా మోసపోతున్నారు. కుటుంబ అవసరాలు, బెట్టింగ్‌ల కోసం ఎక్కువగా యువత తమ వద్ద ఉన్న బైక్‌లు, ఇతర వాహనాలను వెంటనే డబ్బు కావలసియున్న సందర్భాల్లో అధిక వడ్డీలకు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంటున్నారు. ఈ విధంగా తాకట్టు పెట్టి, గడువులోగా విడిపించుకోలేక బాధితులు నానా అవస్థలు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో తాకట్టు పెట్టుకున్నవారు, ఆ వాహనాలను మరోచోట తాకట్టు పెట్టడం కూడా జరుగుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. అనుమతులు లేకుండా చేస్తున్న ఈ వ్యాపారాలపై అధికారులు దృష్టి నిలిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



సామాన్య ప్రజలకు అత్యవసరంగా డబ్బులు అవసరమైన సందర్భాలను అసరాగా తీసుకొని, వారి నుండి అధిక వడ్డీలు వసూలు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు. అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించి, అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనలు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

– చక్కిరాల మల్లేశ్వరరావు, దమ్మపేట

కఠిన చర్యలు తీసుకుంటాం



అధిక వడ్డీ దందాలు, తాకట్టు వ్యాపార లావాదేవిలపై ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డీలు, వాహన తాకట్టు వ్యాపారాలను నిర్వహించడం చట్టరీత్యా నేరం. నిబంధనలను అతిక్రమించి, సామాన్యుల ఇబ్బంది పెట్టేలా అధిక వడ్డీ వ్యాపారాలకు పాల్పడే విషయం తమ దృష్టికి వస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సాయికిషోర్ రెడ్డి, ఎస్సై

అరెస్టుపై బీఆర్‌ఎస్ ధర్నా



పోలీస్ స్టేషన్ సెంటర్‌లో బైఠాయించి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి, ఆదివాసీలు

అశ్వారావుపేటరూరల్: ఓ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తను అక్రమంగా పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి, దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే, బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త గీగా నవీన్.. ఇదే గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు క్యూలైన్లో ఉన్నాడు. ఈ క్రమంలోనే అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకుడు ఆరేపల్లి సూరిబాబు సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలోకి రెండు మూడు, సార్లు వెళ్లడాన్ని గమనించి ప్రశ్నించాడు. దీంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సూరిబాబు వద్ద సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని బయటకు పంపాడు. నన్నే ప్రశ్నించి, సెల్‌ఫోన్ తీసుకునేలా చేస్తావా అంటూ.. నవీన్‌తో కాంగ్రెస్ గ్రామ నాయకుడు వాగ్వాదానికి దిగి, బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కాగా మంగళవారం ఉదయం నవీన్‌ను స్థానిక పోలీసులు కేసు విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కు పిలిచి.. సీఐ జితేందర్ రెడ్డి దాడి చేశాడని, మధ్యాహ్నం దాకా నిర్బంధించాడని బాధితుడు తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటి, ఆదివాసీ సంఘాల నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. స్టేషన్‌లో ఉన్న సీఐ వద్దకు మాజీ ఎమ్మెల్యే వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తను అక్రమంగా నిర్బంధించి, దాడి చేస్తారా..అంటూ ప్రశ్నించసాగాడు. ఆపై పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై గంటకు పైగా బైఠాయించి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ భారీగా నిలిచిపోవడంతో స్థానిక ఎస్సై శివరామకృష్ణ, పోలీస్ సిబ్బంది అక్కడికి చేరుకుని ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ నాయకులతో చర్చించారు. ఇరువర్గాల ఫిర్యాదులపై విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో చివరికి ఆందోళన విరమించారు.

దాడి మాట అవాస్తవం: సీఐ

పోలింగ్ కేంద్రం జరిగిన ఘటనపై ఇరు వర్గాలు ఫిర్యాదు చేశారని, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తపై తాను దాడి చేయలేదని స్థానిక సీఐ జితేందర్‌రెడ్డి విలేకరులు తెలిపారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు. సిబ్బంది పోలింగ్ విధుల్లో ఉండటం వల్ల ఆలస్యమైందని అన్నారు.

ఉరుములతో మోస్తరు వర్షం



వర్షానికి బురదమయంగా మారిన రహదారి

బూర్గంపాడు: మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన ఓ మోస్తరు వర్షానికి వాతావరణం చల్లబడింది. భానుడి భగభగలతో అల్లాడిన ప్రజలు వర్షానికి చల్లబడిన వాతావరణంతో ఉపశమనం పొందారు. ఏప్రిల్ నెలలో విపరీతమైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మే మొదటివారం కురిసిన భారీ వర్షంతో ఎండల తీవ్రత దగ్గింది. గత మూడురోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా లేకున్న ఉక్కపోతతో జనాలు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం కురిసిన వర్షంతో ప్రజలు ఊరట చెందారు.

దమ్మపేట: మండలంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన సాధారణ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుండే ఆకాశం మేఘావృతం కాగా మండలంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో స్థానికులు చల్లదనానికి వేడి తీవ్రత నుంచి ఉపశమనం పొందారు. మండల కేంద్రం, దమ్మపేట గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన సాధారణ వర్షపాతం నమోదు కాగా భారీ శబ్ధంతో కూడిన పిడుగులు పడినట్టు సమాచారం.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బూర్గంపాడు: వేపలగడ్డ గ్రామానికి చెందిన ఎస్‌కె.సమీర్(20) సోమవారం రాత్రి జగన్నాధపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందించారు.

కాంగ్రెస్ నాయకుడికి..



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: మండలంలోని కే లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కనుబుద్ది దేవా కుటుంబాన్ని డిసిసి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య పరామర్శించారు. గత కొన్ని రోజుల క్రితం దేవా తండ్రి శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వీరయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు వీరమాచినేని వినీల్, భద్రాచలం పట్టణ అధ్యక్షుడు పరిమి శ్రీనివాసరావు, నాయకులు అడబాల వెంకటేశ్వరరావు, పూజారి సూర్యచంద్రరావు, వాసిరెడ్డి సాంబశివరావు, కొల్లాపూడి వరుణ్ తదితరులు ఉన్నారు.

అవమానించడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు చెన్నకేశవరావు

అశ్వారావుపేటరూరల్: కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీని బతికించి క్షేత్రస్థాయిలో బలోపేతం చేసిన పాత కాంగ్రెస్ నాయకులను అవమానాల పాలు చేయడం సరికాదని ఆ పార్టీ మండల సీనియర్ నాయకుడు మొగళ్లపు చెన్నకేశవరావు అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్లమెంట్ పోలింగ్ సరళిపై చర్చించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాఘురాం రెడ్డి విజయం కాంక్షిస్తూ క్షేత్ర స్థాయిలో ప్రచారం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు ఏ ఒక్కరి గెలుపు కాదని, అందరి కృషితోనే సాధ్యమైందని నూతనంగా పార్టీలోకి చేరిన పొంగులేటి వర్గం నాయకులకు పరోక్షంగా హితవు పలికారు. సమావేశంలో నాయకులు జ్యేష్ట సత్యనారాయణ, కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, మాజీ సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, జల్లిపల్లి దేవరాజ్, సత్యవరపు బాలయ్య, బత్తుల ఆంజనేయులు, ఎస్‌కే బషీర్, రాచకొండ బంగారం, చల్లా రమాదేవి, కొలుగుపోగు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలి

బూర్గంపాడు: వామపక్షాలు ఏళ్ల తరబడి పోరాడి యూపీఏ ప్రభుత్వ పాలనలో అమలులోకి తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

మోతె పట్టీనగర్‌లోని ఉపాధి హామీ పనిప్రాంతంలో మంగళవారం కూలీలతో ఆయన సమావేశం నిర్వహించారు. పదేళ్ల ఎన్డీఏ పాలనలో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కూలీల శ్రమకు తగిన వేతనం చెల్లించకుండా మొక్కుబడిగా పథకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ 300 వేతనం చెల్లించాలని, ఏడాదికి 200 పనిదినాలను కచ్చితంగా కల్పించాలన్నారు. సమావేశంలో తుమ్మల గురుస్వామి, వెంకటేశ్వర్లు, మంగ, విజయలక్ష్మి, నాగేశ్వరరావు, సోమయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



ఎస్‌ఓటూజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఇఫ్టూ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రతీ నెల 7వ తేదీ నాటికి వేతనాలు చెల్లించడంతో పాటు పే స్లిప్పులు అందించే విధంగా కార్పొరేట్ ఆదేశాలు అమలు చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కురం నాగేశ్వరరావు మాట్లాడుతూ మణుగూరులోని వివిధ గనుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సివిల్, పర్చేజ్ టెండర్లకు సంబంధించి కార్పొరేట్ ఆదేశాలు నిబంధనల ప్రకారం ప్రతి నెలా 7వ తేదీ కల్లా వేతనాలు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ఎక్కువమంది కాంట్రాక్టర్లు 15వ తేదీకి కూడా చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా సీఎంపీఎఫ్ జమ, పెన్షన్ రికవరీ పోనూ నికర సంపాదనకు సంబంధించి బ్యాంకు ఖాతాలో జమ వివరాలతో కూడిన జీతపు పే స్లిప్పులు సదరు కాంట్రాక్టర్లు కాంట్రాక్ట్ కార్మికులకు అందజేయడం లేదన్నారు. పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేయగా ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రాధాన్యతాక్రమంలో సమస్య పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగేశ్వరరావు, రవి, తుపాకుల రాములు, రజబ్ అలీ, కారం చందు, గుండాల శీను, శివ కృష్ణ, దాసు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు ఒక వైపే రంగులు



ఒకవైపు మాత్రమే రంగులు వేసి ఉన్న తేగడ వంతెన

చర్లరూరల్: మండలంలోని తేగడ వద్ద ఉన్న తాలిపేరు వంతెనకు ఒకవైపు రంగులు వేసి మరోవైపు రంగులు వేయడం మరిచారు అధికారులు. సుమారు నెల రోజులకు పైగా ముందే రంగులు వేయడం ప్రారంభించి నేటికీ ఇంకా పూర్తి చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వంతెన మీదుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు సైతం వంతెనకు రెండో వైపు రంగులు వేయడానికి ఇన్ని రోజులు పడుతుందా.. లేక అధికారుల పర్యవేక్షణా లోపమా అని చర్చించుకుంటున్నారు. వేసిన ఆ ఒక్క వైపు రంగులు కూడా వేసామా లేదా అన్నట్లుగా ఉన్నాయి.

త్వరలోనే రంగులు వేయిస్తాం: డీఈ

ఈ విషయంపై ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్ వివరణ కోరగా.. తేగడ వద్ద ఉన్న వంతెనకు రెండోవైపు త్వరలోనే రంగులు వేయిస్తామన్నారు. సదరు కాంట్రాక్టర్ కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యల వల్ల అందుబాటులో లేనట్లు, ఎన్నికల తర్వాత వచ్చి పూర్తి చేస్తామని చెప్పినట్లు డీఈ తెలిపారు. కాంట్రాక్టర్ రాగానే రంగులు వేయిస్తామన్నారు.

విద్యుత్ సమస్యలపై నజర్

- ఫిర్యాదు రాగానే స్పందిస్తున్న సిబ్బంది
- ఎండల్లోనూ కరెంట్ పునరుద్ధరణకు కృషి
- ఫలితాన్నిస్తున్న విద్యుత్ లైన్ల ఆధునికీకరణ



భద్రాచలం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



తీవ్రమైన ఎండలో మెయిన్‌లైన్ పనులు చేస్తున్న విద్యుత్ కార్మికుడు

భద్రాచలంఅర్బన్: మండుటెండల్లో విద్యుత్ సిబ్బంది అందిస్తున్న సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వేసవిలో తరచూ కరెంటు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో అధికారులు అప్రమత్తమై తక్షణం సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలంలో 40 డిగ్రీలకు పైగా కాస్తున్న ఎండల్లోనూ కరెంటు సిబ్బంది కష్టపడి విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తున్నారు. భద్రాచలంలో ఈ మధ్య అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడం వల్ల అక్కడక్కడ ఫీజులు ఎగిరిపోయాయి. కరెంట్ లోడు అధికంగా ఉండటం, గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో నిత్యం కరెంట్ సరఫరాకు ఎక్కడోచోటు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్య గత కొద్ది రోజుల నుంచి తలెత్తుతుంది. దీంతో విద్యుత్ సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్లను ఆపి సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వైరింగ్లో సమస్యలు తలెత్తుతున్నాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. లోడు మార్పిడి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

భద్రాచలం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 27,680 కనెక్షన్లు ఉన్నాయి. వాటిల్లో గతం కన్నా భద్రాచలంలో ఏసీల వాడకం గణనీయంగా పెరిగింది. సుమారు 15 నుంచి 20 శాతం ఈ పెరుగుదల ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. భద్రాచలం పట్టణంలో ట్రాన్స్‌కో అధికారులు రూ.3 కోట్లతో విద్యుత్ ఆధునీకరణ పనులు నిర్వహించారు. ఇటీవల భద్రాచలం లో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీరామ నవమి వేడుకలకు గాను భద్రాచలం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో భద్రాచలం సబ్‌స్టేషన్‌లలో 1.2 కోట్లతో పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను ఏర్పాటు చేయగా, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 5, 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 5, అదే విధంగా భద్రాద్రి రామాలయం కోసం ఒక 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. మరోవైపు పట్టణంలో ప్రజల వినియోగం కూడా బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఎదురవుతున్న లోవోల్టేజీ సమస్య, ఇతరత్రా సాంకేతిక విద్యుత్ సమస్యలకు రూ.1.20 కోట్లతో విద్యుత్ లైన్లను ఆధునీకరించారు. దీంతో కొంత కాలంగా ఎదురవుతున్న సమస్యలు తొలగనున్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే కొర్రాజులగుట్ట, భద్రాచలం ఉప కేంద్రాల వద్ద సాంకేతిక పరమైన సమస్యలను తొలగించేందుకు రూ.35 లక్షలతో పనులను చేపట్టారు. ఇదిలా ఉండగా రామాలయం చుట్టూ ఉన్న విద్యుత్ స్తంభాలు తీసేసి టవర్ల ఏర్పాటుకు టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ రూ.25 లక్షలు మంజూరు చేశారు.

పది నిమిషాల్లోనే స్పందిస్తున్నాం..



వేసవికాలంలో చిన్న చిన్న సమస్యలు రావడం సర్వసాధారణం. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అక్కడక్కడ సమస్య ఉత్పన్నమవుతోంది. ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో స్పందించి విద్యుత్ సరఫరాను అందిస్తున్నాం. ఉష్ణోగ్రతలను సైతం లెక్క చేయకుండా విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరణ చేసేందుకు కృషి చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేదా లో వోల్టేజ్ సమస్య ఉంటే వెంటనే స్థానికంగా ఉన్న విద్యుత్ అధికారులకు సమస్యను తెలిపాలి.

– టి.వేణు, విద్యుత్ శాఖ ఏడీఈ, భద్రాచలం